





# చెల్లాయి పెళ్లి

టెంపోరావ్

అతనికి ఒక్కగానొక్క కొడుకు. కాని కొడుకు ప్రయోజకుడు కాలేకపోయాడు.

చదువులో వెనకబడి, డింకీలుకొట్టి కొడుకు చదువు మానేశాడు. ధర్మారావు అనే చక్కటి పేరున్నా అందరూ అతడిని మొద్దబ్బాయి అని పిల్చేవారు.

కొడుకు వయస్సు నలభై వుంటుంది. చిల్లర పనులు చేస్తూ అతడు యింటిపట్టునే పడివుండేవాడు. చిన్నతనం నుంచీ అతడి మెదడు సహజంగా వృద్ధిచెందలేక కుంటుపడింది. డాక్టర్లకు చూపించకుండా తల్లిదండ్రులు అశ్రద్ధ చేశారు.

నెలరోజులనుంచి రాజారావు డబ్బుకోసం తిరుగుతున్నాడు. కాని ఎక్కడా లభించలేదు.

కలెక్టర్ ఆఫీసులో తను వుద్యోగం యిప్పించిన కేశవరావును కలుసుకుని రాజారావు మండుటెండలో యింటికి తిరిగొచ్చి కుర్చీలో కూలిపోయాడు.

నరసమ్మ అతడికి మంచినీళ్లిచ్చింది.

"ఏమైందండీ?" ప్రశ్నించింది.

"రోజూ వినేదే! ఎవ్వరి దగ్గరా రెడీక్యాష్ లేదు, చూస్తానన్నాడు కేశవరావు!" అన్నాడతను.

నెలక్రితం వాళ్లందరూ వచ్చి పిల్లను చూశారు. పిల్ల నచ్చిందని చెప్పి తదితర ముఖ్య విషయాలు మాట్లాడారు. ఆ విధంగా అన్నీ చేయగల్గితే తమకు ముందుగా రాసి తర్వాత ముహూర్తం పెట్టించమన్నారు.

అంతా ఆలోచించి రాస్తానన్నాడు రాజారావు మాట వరసకి.

కట్నంగా పదివేలు తను యివ్వలేడని అతడికి తెలుసు. కలెక్టరు ఆఫీసులో గుమస్తాగా పనిచేసి అతడు రిటైరయ్యాడు. పనిలో వుండగా ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాడు. కమల నాల్గోది, ఆఖరిది.

"ఎంతకాలం చూస్తూ కూర్చుంటాం? ఇంకా ఆలశ్యమైతే అతడు మరెవర్నో పెళ్లాడేస్తాడు" అందామె.

విసుగ్గా అతడు భార్యకేసి చూశాడు.

"పోతేపోనీయవే! దానికి పెళ్లయ్యే యోగం వుంటే అవుతుంది."

అతడు భార్యవంక దీనంగా చూశాడు. ఆమె తనకంటే ఆరేళ్లు చిన్నది. కాని వయస్సును మించి ముసలిదై పోయింది, తనలాగే. చాలీచాలని తిండి, జీవితం లోని సాధకబాధలు, దినదినం పెరుగుతున్న నిరాశ, ఇవన్నీ మనిషిని మానసికంగా గాయపర్చి వృద్ధాప్యంలోకి యీడ్చుకుపోతాయి.

"కమల అలా పడుండవలసిందేనా?"

ఆమె ప్రశ్నకు అతడు జవాబివ్వ లేదు. కుర్చీలో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు. నెలనెలా వచ్చే పెన్షన్ డబ్బుతో అతడు సంసారాన్ని సాగిస్తున్నాడు.

ఉన్నదంతా ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లకు ఖర్చయిపోయింది. ఆఖరున కమల తన కుటుంబంలో ఎందుకు పుట్టిందో?

నూతి పక్కన నిలబడి కమల నీళ్లు తోడ్తోంది. వెనుకనుంచి అరుపులు వినబడ్డాయి. ఆమె వెనక్కి తిరిగి చూసింది. అన్నయ్య అరుస్తూ, చేతులెత్తి కాకి వెనుకనే ఎగరడానికి ప్రయత్నిస్తున్నాడు, గెంతులేస్తున్నాడు.

"అన్నయ్యా, ఏమిటది?" అడిగిందామె.

"కాకిలా నేనూ ఎగుర్తాను!" అన్నాడతను.

"ఎగిరి ఎక్కడ కెళ్తావు?"

అతడు జుత్తులోనికి వేళ్లను పోనిచ్చి వుండిపోయాడు.

"తెల్సింది చెల్లాయి. ఎగిరెళ్లి నిన్ను చూసి వెళ్లిపోయిన పెళ్లికొడుకును నా వీపుమీద కూర్చోబెట్టి తెస్తాను."

"అందుకే అందరూ నిన్ను మొద్దబ్బాయి అంటారు!" అందామె నవ్వుతూ.

"అంటే అన్నీయి చెల్లాయి! నేను ఏడవనులే. కాకిలా ఎగుర్తూ, కోకిల్లా కూస్తూ హాయిగా వుంటాను."

ఆమె అతడి వంక నవ్వుతూ చూసింది.

"అన్నయ్యా నాకు పెళ్ళవుతుందనే నమ్మకం నీకుందా?" అడిగిందామె.

అమాయకంగా అతడామెవైపు చూశాడు. యవ్వన కాంతులతో ఆమె ముఖం మెరుస్తోంది. పేదరికం యింకా ఆమె శరీరచ్ఛాయను మార్చలేదు.

"నువ్వు అందంగా వుంటావు చెల్లాయి. నీ పెళ్లి తప్పక అవుతుంది."

"పదివేల కట్నం. లాంఛనాలు. అటుపైన పెళ్లి ఖర్చు. అంత డబ్బు నాన్న ఎక్కడ్నుంచి తెస్తాడు?" అందామె.

"నన్ను అమ్మేయమంటాను, నీ పెళ్లికోసం! ఎవరో కొనుక్కుంటారు. వాళ్లింట్లో యీ పనీ, ఆ పనీ చేస్తూ వుంటాను."

ఆమె పైకి నవ్వినా లోలోపల బాధపడింది. అన్నయ్య జీవితం ఒంటరిగా సాగిపోతోంది. నాన్నా అమ్మా పోయాక అతడిని ఎవరు చూస్తారు?

తనకు పెళ్ళంటూ అయితే అన్నయ్యను తన యింట్లో వుంచుకోవాలని ఆమె లోలోపల అనుకుంది.

గుమ్మంలో అతడు నిలబడ్డాడు. గదిలో తల్లీ తండ్రీ మాట్లాడుకుంటున్నారు.

"అన్నీ చేస్తామని వాళ్ళకు ఒక వుత్తరం రాసిపడేయండి" అందామె.

"ఉత్తరం రాయడం అంత పెద్దపని కాదే. అలా రాసిన తర్వాత ఏమీ చెయ్యలేకపోతే అందరూ నవ్వుతారు" అన్నాడు రాజారావు

"మనం జవాబు రాయకపోతే అతడు మన చేతుల్లోంచి జారిపోతాడండీ!"

"చేతుల్లో వుండేగా జారిపోడానికి!" అన్నాడతను విసుగ్గా.

అతను లోపలకు వెళ్లాడు.

"ఉత్తరం రాయి నాన్నా."

"ఎవరికిరా?" అడిగాడు తండ్రి.

"చెల్లాయి పెళ్లివార్కి."

"డబ్బు నువ్వు తెస్తావట్రా?" అడిగాడు రాజారావు చికాకుగా.

"నేను మొద్దబ్బాయిని కావచ్చు నాన్నా. కాని చెల్లాయి పెళ్లికి డబ్బు వస్తుంది."

"ఒరే వెర్రబ్బాయి, నీ మాట ఫలించి నిజమయితే సంతోషిస్తానురా" అంది తల్లి.

"అవుతుందమ్మా" అన్నాడతను.

* * *

పొద్దుటే నర్సమ్మ అతడికోసం చూసింది. అతడు ఎక్కడా కనపడలేదు.

"ఏమండీ, వాడిని ఎక్కడికేనా పంపారా?"

"ఎక్కడికో పోయుంటాడు, వస్తాడులే" అన్నాడు రాజారావు.

ఆ రోజు సాయంత్రందాకా అతడి రాకకోసం అందరూ ఎదురుచూశారు. కాని అతడు రాలేదు.

సాయంత్రం బజారుకు వెళ్లేముందు పెట్టెలో వుండే పర్సుకోసం రాజారావు చూశాడు. అందులో 200 రూపాయలు పైన వుండాలి. కాని యాభై రూపాయిలు, కొంత చిల్లర మాత్రం వుంది. పర్సులో మడిచిపెట్టిన కాగితాన్ని తెర్చి చూశాడతను.

"నాన్నకి,

నూటయాభై తీసుకుని చెల్లాయి పెళ్లికి డబ్బు కోసం వెళ్తున్నాను. తిరిగి వస్తాను. డబ్బు తెస్తాను.

మీ

మొద్దబ్బాయి."

చీటీ పట్టుకుని అతడు వంటగదిలోకి పరుగెత్తాడు.

"ఈ మొద్దు వెధవ ఎంతపని చేశాడో చూశావటే! 150 రూపాయిలు పట్టుకుని ఎక్కడికో వెళ్లిపోయాడు. చెల్లాయి పెళ్లికి డబ్బు తెస్తాడట!" అన్నాడతను పరిహాసంగా.

"వెర్రాడి చేష్టలు మనకు అర్థం కావండీ! తెస్తాడేమో!" అంది నర్సమ్మ.

చెల్లాయి కమల అంతా ఆశ్చర్యంగా వింటోంది.

"ఎవడో ఆ డబ్బు లాగేసి నామం పెట్టి యింటికి పంపిస్తాడు. ఈ నెల మనకు ఎలా గడుస్తుందో!" అన్నాడు రాజారావు.

రోజులు గడిచిపోతున్నాయి. నెల దాటింది. కాని మొద్దబ్బాయి తిరిగి రాలేదు.

"వెర్రాడు ఏమయ్యాడో! కళ్లముందు వాడు తిరుగుతూంటే సంతోషపడేదాన్ని. ఆ అదృష్టం కూడా లేకుండాపోయింది" అని నర్సమ్మ ఏడ్వసాగింది.

పక్కనే కూర్చుని కమల ఏడుస్తోంది. కుర్చీలో కూర్చున్న రాజారావు కళ్లు తుడుచుకున్నాడు.

"అవునే! వాడు లేకపోతే ఎందరో లేనట్లు వుంది. వాడికోసం ఎక్కడ వెతకను?" అన్నాడు తండ్రి.

"అన్నయ్య వుత్తరం ఎందుకు రాయలేదో!" అంది కమల.

బయట సైకిల్ రిక్షా ఆగింది. అందరూ గుమ్మంవైపు పరుగెత్తుకెళ్లారు. అతను నవ్వుతూ కిందకు దిగాడు. రిక్షావాడికి డబ్బిచ్చి సంచితో అతడు లోపలకు వుషారుగా వచ్చాడు.

"ఎగిరొచ్చేశాను! చెల్లాయి పెళ్ళికి డబ్బు తెచ్చాను" అన్నాడతను.

"నిజంగా?" అంది తల్లి.

సంచిలోంచి నాలుగు నోట్లకట్టలను తీసి అతడు తండ్రి కిచ్చాడు.

"నలభైవేలు, నాన్నా! చెల్లాయి పెళ్ళికి చాలుగా?" అడిగాడతను అమాయకంగా.

నోట్లకట్టలను తీసుకున్న తండ్రి చేతులు వణుకుతున్నాయి.

"ఇంత డబ్బు ఎక్కడిదిరా?" రాజారావు ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"దొంగిలించలేదు నాన్నా. చెల్లాయి పెళ్ళికి ముహూర్తం పెట్టించండి" అని పెరట్లోకి పరుగెత్తాడు.

చెల్లాయి పెళ్ళి వైభవంగా జరిగింది. ఆనాటి సాయింత్రం రిసెప్షన్ జరుగుతోంది.

వధూవరులు పెద్ద సోఫా ముందు నిలబడ్డారు.

అతడు చెల్లాయి సమీపంలో నిలబడ్డాడు. అనేక మంది వస్తున్నారు. హాల్లోని లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. ప్లేబాక్ సింగర్ పరమానంద్ శ్రావ్యంగా పాడుతున్నాడు.

యాభైఏళ్ల వ్యక్తి భార్యతో సహా వధూవరుల ముందుకు వచ్చాడు.

"బావా వచ్చావా! పెళ్ళికి రాలేకపోయినా రిసెప్షన్‌కి వచ్చినందుకు చాలా సంతోషం. ఈయన కామరాజుగారు. నా పెద్దబావ. ఆమె నా అక్కయ్య రామలక్ష్మి. వీళ్లు ఢిల్లీలో వుంటున్నారు" పెళ్ళికొడుకు కమలకు పరిచయం చేశాడు.

ఆమె వినయంగా వంగి నమస్కరించింది.

"గోపీ, చచ్చి బ్రతికాను. నీ పెళ్ళికి రాలేనేమో అనుకునేవాడిని" అని కామరాజు ఆశ్చర్యంగా ఎవర్నో చూస్తూ వుండిపోయాడు.

అతడి చూపు కమల అన్నమీద కేంద్రీకృతమైంది.

"అతను.... ధర్మారావు. యిక్కడున్నాడేమిటి?" ప్రశ్నించాడు కామరాజు.

"ధర్మారావు నా అన్నయ్య. అతను మీకు తెలుసా?" అడిగింది కమల, వెనక్కు చూస్తూ.

ధర్మారావు అక్కడ లేడు. మెల్లిగా గదిలోకి వెళ్ళిపోయాడు. కామరాజు నవ్వుతూ కమలవంక చూశాడు.

"అతను దేవుడిలా ఢిల్లీ వచ్చి నన్ను కాపాడాడు. రెండు కిడ్నీలూ పాడై నేను చావుబ్రతుకుల మధ్య పడున్నాను. అన్ని దినపత్రికలలోనూ నా స్థితి గురించి ప్రకటనలు వేయించాను. ఏ దానకర్ణుడో వచ్చి ఒక కిడ్నీ యిస్తాడని ఎదురు చూస్తూ వున్న సమయంలో ధర్మారావు వచ్చి తన కిడ్నీ యిచ్చి నాకు జీవం పోశాడు" అన్నాడు కామరాజు.

కమల కళ్ళమ్మట నీళ్లు జలజల కారాయి. ఆమె అక్కడినుంచి వేగంగా వెళ్ళిపోయింది. వెనకనే గోపీ కదిలాడు.

ధర్మారావు నవ్వుతూ వాళ్ళవైపు చూశాడు. కమల కాళ్ళమీద పడి కన్నీళ్ళతో అతని పాదాలను తడిపి నమస్కరించింది.

"అన్నయ్యా, నా కోసం ఎంత త్యాగం చేశావు!" అందామె.

రాజారావు, నర్సమ్మ గదిలోనే వున్నారు.

"లే, చెల్లాయి! నేను చేసినదానిలో ఎటువంటి త్యాగం లేదు. మనిషికి విలువ లేకపోయినా మనిషిలోని కొన్ని అవయవాలు చాలా విలువైనవని డాక్టర్ రాజు అన్నారు. ఆయనే నన్ను ఢిల్లీ వెళ్ళమన్నారు. చెల్లాయి, నేను ఒంటరి వాడిని. మొద్దబ్బాయిని. నాలాంటి జీవికి ఒక కిడ్నీ చాలుగా, అందుకని రెండోది ఆయన కిచ్చేశాను. ఆయన సంతోషంగా డబ్బిచ్చారు. నీ పెళ్ళి బాగా జరిగింది. నాకు కావలసింది అదే!" అన్నాడతను.

"మమ్మల్ని దీవించు అన్నయ్యా" అని ఆమె భర్తవైపు చూసింది.

వధూవరులు మోకరిల్లి నమస్కరించారు. వాళ్ళవైపు సంతోషంగా చూస్తూ దీవించాడతను.

అతడి చూపు తల్లితండ్రుల వైపు మళ్ళింది. వాళ్లు కళ్ళను తుడుచుకుంటున్నారు.